# శిలువ బొమ్మ

ఆఖరి రోజు మూడు రోజులుగా ఆ వూరి హై స్కూలు ఆట మైదానంలో క్రీస్తు సువార్త కూటాలు జరుగుతున్నాయి. అప్పటికే పల్లెలో జనం చాలావరకు వాటికి వెళ్ళివచ్చారు.

పండగలా వుంది. తిరునాళ్ల వాతావరణం. పిల్లకయితే హుషారుగా వుంది. అంతా సందడి పల్లెకీ, హై స్కూలుకీ మధ్య ఎక్కువ దూరం లేదు.

క్రితంరోజు రాత్రి యాకూబు తన భార్య మరియను తీసుకుని కూటాలకు వెళ్లివచ్చాడు. వాళ్లు రాత్రి ఇంటికి వచ్చింతర్వాత ఇంటి ముందున్న వేపచెట్టుకింద మంచాలమీద పడుకుని కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు, వాళ్ల పెద్దకూతురు ఎస్తేరు రాణి విని చాలా బాధపడింది.

ఎందుకంటే ఆమె కూడా కూటాలకు వెళ్లాలని అనుకున్నా తల్లీతండ్రీ పన్నెండేళ్ల ఆ అమ్మాయిని మూడేళ్ల తమ చిన్నకూతురికి తోడుగా వుంది. వాళ్లిద్దరే కూటాలకు వెళ్లివచ్చారు.

కానీ ఎస్తేరు రాణికి కూటాలకు వెళ్లిరావాలనే కోరిక చాలా బలంగా వుంది. దీనికితోడు ఆరోజు ఉదయం ఆ పరసలోనే ఒక గుడిసెలో వుండే యోహాను. తను మొదటి రోజునే కూటాలకు వెళ్లినట్టూ అన్నీ చూసినట్టూ వర్ణించి మరీ చెప్పాడు. అన్నీ చెప్పి.... చివరగా.... బొమ్మలు అమ్మే అంగడి గురించి చెప్పాడు మరీ గొప్పగా. ఆ అంగడిలో రకరకాల దేవుడి పటాలున్నాయనీ, వాటిల్లో శిలువ బొమ్మ వున్న పటం చాలా బాగుందనీ అన్నాడు. దాన్ని కొనాలని అనుకుంటే తన దగ్గర పది రూపాయలు లేవనీ అందుకు చాలా బాధగా వుందనీ చెప్పాడు యోహాను.

అప్పటినుంచీ, ఎలాగయినా తను కూడా ఆఖరిరోజున కూటాలకు వెళ్లాలనీ, ఆ శిలువ బొమ్మను కొనాలనీ అనుకుంది ఎస్తేరు రాణి.

ఆఖరిరోజు కూటాలకు యోహాను.... తను వెళుతున్నాడని చెప్పాడు. వాడికి కూడా ఇంచుమించు ఎస్తేరు రాణికి వున్నంత వయసు వుంటుంది. నాలుగో తరగతి వరకూ పల్లెలో వున్న స్కూల్లో చదివి, తర్వాత చదువును ఆపేశాడు. అమ్మానాన్నలతో మిరపకాయ కోతలకీ, పొగాకు విరుపులకీ వెళుతున్నాడు.

వాడు సంపాదించిన కూలీడబ్బుల్ని వాడి దగ్గర రూపాయి కూడా మిగల్చకుండా ఎప్పటికప్పుడు తండ్రి అబ్రహం లాక్కుంటాడు. అందువల్లనే

యోహాను.... కూటాల్లో శిలువ బొమ్మను కొనలేకపోయాడు.

ఆరోజు కూటాలకు వెళ్లాలని నిర్ణయించుకున్న తర్వాత ఎస్తేరు రాణి.... ఇంట్లో పనులన్నింటినీ త్వరగా ముగించుకుంది. ఆ పని తొందరకు తల్లి కారణమడిగితే.... తను కూటాలకు వెళుతున్నట్టు చెప్పింది.

తండ్రి ఇంట్లో లేడు. కూలీపనికి వెళ్లాడు. సాయంత్రానికి తిరిగివస్తాడు.

తల్లీ తండ్రీ ఇంట్లోనే వుంటారు కాబట్టి, చిన్న చెల్లెలికి తోడుగా తను ఇంట్లో వుండాల్సిన అవసరం లేదు. అందుకే ఆ అమ్మాయి సంతోషంగా వుంది.

ఎటొచ్చీ ఒక్కటి విచారం. ఆ శిలువ బొమ్మను ఎలా కొనాలి? తన దగ్గర డబ్బులు లేవు. తల్లిని అడిగినా ఇవ్వదు. ఇంట్లో అంతా తండ్రి పెత్తనం. డబ్బులన్నీ తండ్రి ఆధీనంలోనే వుంటాయి.

అయితే తండ్రి ఆ డబ్బులను ఎక్కడ దాచిపెడతాడో ఆమెకి తెలుసు. వాటినించి పది రూపాయల్ని కాజేసి ఆ శిలువ బొమ్మను కొనాలి! ఇలా అనుకున్న తర్వాత ఎస్తేరు రాణి మనసు కుదుటపడింది.

పల్లెలో మధ్యగా చర్చి వుంది. ప్రతి ఆదివారం తల్లి మరియతోపాటు ఎస్తేరు రాణి కూడా అక్కడికి తప్పకుండా వెళుతుంది. అందరితోపాటు తను కూడా ప్రార్ధన చేస్తుంది. క్రీస్తు దయవల్లనే మనుషులంతా సుఖంగా సంతోషంగా వుండగలరని. ఆ చర్చిలో.... తెల్లని బట్టలూ మెడలో తెల్లని శిలువ వున్న గొలుసూ వేసుకున్న ఫాదర్ చాలాసార్లు చెప్పడం శ్రద్ధగా విందామె.

తల్లి కూడా ఆ మాటను బలపరుస్తూ అదే విషయాన్ని కూతురితో చాలాసార్లు చెప్పింది. అందువల్ల ఆ మాటలన్నీ ఎస్తేరు రాణి మనసులో బలంగా నాటుకుపోయాయి.

ఆరోజు సాయంత్రం ఆరుగంటలు దాటుతున్నప్పుడు, ఇంటికి చేరాడు తండ్రి యాకూబు. రావటంతోనే కుండలో మంచినీళ్లు తాగి, ఆ గుడిసెలో ఒక మూలగా వున్న చెక్కపెట్టె దగ్గరికి వెళ్లాడు. మురికి పట్టిన చొక్కాజేబులో నుంచి కూలీడబ్బుల్ని తీసి ఆ చెక్కపెట్టెలో వుంచాడు. అతను అలా దాచడాన్ని ఎస్తేరు రాణి చూసింది. ఇక తను శిలువ బొమ్మ కొనటానికి అవసరమయిన పది రూపాయలకు ఇబ్బందిపడాల్సిన అవసరమే లేదనుకుంది.

యాకూబు కూడా బాగా దైవ విశ్వాసం వున్న మనిషి. ఆ పల్లె మధ్యలో చర్చిని నిర్మించటానికి అతను కూడా బాగా శ్రమించాడు. ఇంకొంతమందితోపాటు

ఇటుక రాళ్లనీ సిమెంటు బొచ్చెల్నీ మోశాడు. ఆదివారాల్లోనూ ఇతర పండగ దినాల్లోనూ జరిగే ప్రార్ధనా సమావేశాలకి పల్లెలో అతనికి ఓ మంచి మనిషిగా పేరుంది.

చీకటిపడింది. అప్పుడే ఆ పల్లెలోని కొంతమంది ఆడవాళ్లు గుడిసెల బయట వున్న రాళ్లపొయ్యిమీద వంట ప్రారంభించారు. పుల్లలతో వంటపెట్టి కుండలతో అన్నాలు వండసాగారు.

నిజానికి ఇంట్లో ఎస్తేరు రాణే రోజూ అన్నం వండుతుంది. కానీ ఆరోజు ఆ పనిని తల్లికి అప్పగించింది. ఆవిడా అందుకు వొప్పుకుంది. వొళ్లు దాచుకోకుండా ఇంటి పనంతా చేసే అమ్మాయి కాబట్టి కూతురంటే తల్లికి అంత ఇష్టం, అంత ప్రేమ.

ఇంటి బయట వేపచెట్టు పక్కన వున్న తడికల స్నానాలగదిలో స్నానంచేసి, ఉతికిన దుస్తులు కట్టుకుంది ఎస్తేరు రాణి. చీకట్లో బయటకు వెళుతూ తల్లి దగ్గరికి వచ్చి "కూటాల్లో ఏమైనా కొనుక్కోటానికి డబ్బులివ్వు" అని తల్లిని అడిగింది. అయితే అప్పటికే ఆ పిల్ల చెక్కపెట్టెలోనుంచి పది రూపాయల నోటును తీసి దాచుకుంది.

"నాకాడ డబ్బుల్లేవు. ఏం కొనద్దులే. చూసి రా...." అంది తల్లి.

ఇంకేమీ మాట్లాడకుండా, గుడిసెల మధ్య వున్న ఇరుకు దారిగుండా బయల్దేరిందామె.

ఆమె వెళ్లేసరికి యోహాను ఆ రోడ్డు చివర వున్న చప్టాదిమ్మె మీద కూర్చుని వున్నాడు. "నువ్వు రావనుకున్నాను" అన్నాడు.

"ఎట్టాగో వచ్చానులే పద" అందామె. వెడల్పుగా వున్న ఈ నీళ్లు లేని కాలవ చప్టా మీదకి ఎక్కుతూ.

ఇద్దరూ కలిసి వెళుతున్నప్పుడు, ఎవరో ఇద్దరు మనుషులు వాళ్లను దాటి గబగబా నడిచి వెళ్లారు.

"శిలువ బొమ్మను కొంటావా?" అడిగింది ఎస్తేరు రాణి.

"డబ్బుల్లేవు అన్నీ మా అయ్య తీసుకున్నాడు" అన్నాడతను విసురుగా.

ఆమెకి నవ్వొచ్చింది. అతనంటే ఆ అమ్మాయికి చాలా ఇష్టం. ఆమెకి అన్నలు, తమ్ముళ్లు లేరు.

యోహాను మంచివాడు. ఆమెతో స్నేహంగా వుంటాడు. కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటాడు. వాళ్ల ఇంట్లోని తినుబండారాల్ని ఆమెకి పెడతాడు.

యోహాను తండ్రి అబ్రహాం, ఎస్తేరు రాణి తండ్రి కూడా స్నేహంగా వుంటారు.

తను యోహానుతో కలిసి కూటాలకు వెళుతున్నట్టు ఎస్తేరు రాణి ఇంతకుముందే తల్లికి చెప్పింది.

అతను మంచివాడని మరియకు కూడా గట్టి నమ్మకం.

పిల్లలిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ హై స్కూలు ఆట మైదానంలో షామియానాలు వేసిన కూటాల దగ్గరికి వెళ్లారు. చివరిరోజు కావడంతో అక్కడ జనం బాగానే వున్నారు. పక్కవూరి మనుషులు కూడా వచ్చినట్టున్నారు.

లోపలికి వెళ్లటంతోనే.... దూరంగా లైట్లతో అలంకరించిన వేదిక కనిపించింది. దానిమీద బల్ల వెనక మైకు ముందు నిలబడి ఉపన్యాసమిస్తున్న తెల్లని దుస్తుల మనిషి కనిపించాడు.

"వింటావా" అనడిగాడు యోహాను.

"ముందు బొమ్మల దుకాణంకాడికి పద" అందామె.

రోడ్డుకు రెండు పక్కలా రకరకాల దుకాణాలు వున్నాయి. వాటి ముందునుంచి నడుస్తున్నారు వాళ్లు.

మతసంబంధ పుస్తకాలు అమ్మే దుకాణాలు, పాటల కేసెట్లూ సీడీలూ అమ్మే అంగళ్లు, కీ చెయిన్లూ క్రీస్తుప్రభువు బొమ్మలు ముద్రించి వున్న బాల్ పెన్నులమ్మే షాపులు, ఇంకా రకరకాల అంగళ్లు వరసగా వున్నాయక్కడ.

వాటన్నింటినీ వింతగా చూసింది ఎస్తేరు రాణి. ఇంతకుముందు ఎప్పుడూ ఆ అమ్మాయి అలాంటి కూటాలకు వెళ్లలేదు. అందుకే వింతగా వుంది.

దీపాలు వెలగటానికి ఏర్పాటుచేసిన జనరేటర్ అక్కడికి బాగా దగ్గరగా వుండటంతో, పెద్దగా చప్పుడు వినపడుతోంది.

అలా నడిచి అన్నిటికంటే చివరగా వున్న అంగడిముందు ఆగిపోయాడు యోహాను. అదే బొమ్మల అంగడి. "ఇదే చూడు" అన్నాడు.

ఆమె ఆత్రంగా చూసింది.

రకరకాల బొమ్మలున్నాయక్కడ.

ఆ అమ్మాయి అలాగే చూస్తున్నప్పుడు యోహాను.... గుట్టగా పోసిన ఆ

బొమ్మల మధ్యనుంచి శిలువ బొమ్మను బయటకు తీసి "ఇదే శిలవ బొమ్మ" అన్నాడు ఆమెకి చూపిస్తూ....

చూసింది.

ఆ బొమ్మ చాలా బాగుంది.

శిలువమీద తలవాల్చి నిలబడి వున్నాడు క్రీస్తుప్రభువు.

"ఎంత?" అడిగింది.

"చెప్పానుగా.... పది రూపాయలు" అన్నాడు యోహాను.

"అవును. ఓ బొమ్మయినా పది రూపాయలు" అన్నాడు ఆ బొమ్మలు అమ్మే నడివయసు మనిషి.

అప్పుడు ఎస్తేరు రాణి లోదుస్తుల నుంచి పది రూపాయల నోటును బయటకు లాగి ఆ నడివయసు మనిషికిచ్చింది. శిలువ బొమ్మను చేతికి తీసుకుంది.

అతను ఆశ్చర్యంగా చూశాడు. ఆమె దగ్గర పది రూపాయలు వుంటాయనీ ఆ శిలువ బొమ్మ కొంటుందనీ అనుకోలేదతను.

బొమ్మను తీసుకున్న తర్వాత, ఇద్దరూ వెనక్కి మళ్లారు. వాళ్లు తిరిగి వస్తున్నప్పుడు కూడా పల్లెలో వాళ్లకు తెలిసినవాళ్లు ఒక్కరూ కనపడలేదు.

"బొమ్మ కొనటానికి డబ్బులెక్కడివి?" అడిగాడు యోహాను. తిరిగి వస్తున్నప్పుడు.

చెక్కపెట్టెలోని పది రూపాయల్ని దొంగిలించానని చెప్పిందామె.

"నువ్వు దొంగతనం చేశావా?" ఆశ్చర్యపడుతూ చెప్పిందామె.

"అవును యోహానూ! శిలువ బొమ్మ కొనాలనే. రేపు కూలీకెళతానుగా, ఆ డబ్బులు అందులో పెడతాను" అంది.

"నాకంటే నువ్వే నయం" అన్నాడతను కొంచెం అసూయగా.

నవ్వి వూరుకుందామె.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, గబగబా నడిచి పల్లెటూరికి వచ్చారు.

యోహాను తన ఇంటికి వెళ్లాడు.

పల్లెకు కరెంటు లేదు. ఇళ్లలో నూనెదీపాలు వెలుగుతున్నాయి.

అక్కడంతా చీకటిగా వుంది.

ఎస్తేరు రాణి శిలువ బొమ్మను దుస్తుల చాటున పెట్టుకుని ఇంట్లోకి వచ్చింది. ఉతికిన బట్టలు పెట్టుకునే వెదురుబుట్టలో ఆ బొమ్మని ఉంచింది.

తల్లి, తండ్రి బయట వేపచెట్టుకింద నులక మంచాలమీద పడుకుని ఉన్నారు.

"బువ్వ తిని పడుకో" అంది తల్లి.

"ఆకల్లేదు" అని వచ్చి తల్లి పక్కనే పడుకుంది కూతురు.

❖ ❖ ❖

తెల్లవారింది.

ఉదయం పదిగంటలు కావస్తున్నప్పుడు చెక్కపెట్టె దగ్గరికి వెళ్లిన యాకూబు దాన్ని తెరిచి చూశాడు.

"ఇందులో పది రూపాయలు తీసుకుందెవరు?" అడిగాడు మరియను.

"తెలవదు" అందావిడ.

"ఎవరు తీసుకున్నారు? ఉన్నదే ఇరవై అందులో పది లేదు" అన్నాడతను అనుమానంగా చూస్తూ.

"రేత్తిరి కూటాలకు ఎల్తా డబ్బడిగింది పిల్ల" చెప్పింది మరియ.

అప్పుడు యాకూబు గబగబా కూతురి దగ్గరికి వచ్చి "నువ్వే తీసుకుని కూటాల్లో కొనుక్కు తినంటావ్" అని ఆమెని వందదీసి వీపుమీద అరచేత్తో కొట్టాడు.

ఎస్తేరు రాణి మౌనంగా వుండిపోయింది.

"కొట్టవయ్యా.... తను యేదన్నా దాచిందేమో.... యెతుకుతాను" అంటూ తల్లి అడ్డుపడింది. ఉతికిన బట్టలు పెట్టే వెదురుబుట్ట దగ్గరికెళ్లి చేతికి వచ్చినన్ని బట్టల్ని బయటికి లాగింది.

అప్పుడు కనిపించింది మరియకు.... తళతళలాడుతున్న ఈ శిలువ బొమ్మ! ఆశ్చర్యపడుతూ చేతికి తీసుకుని "ఇదేమిటి?" అనడిగింది కూతుర్ని.

చెక్కపెట్టెలో డబ్బు తీసి తనే కూటాల్లో ఆ బొమ్మను కొనుక్కున్నట్లు చెప్పింది ఎస్తేరు రాణి.

అప్పుడు తల్లి సంతోషంతో "ప్రభువు మనింటికొచ్చాడు" అంది.

ఆ బొమ్మను ఎదురుగా ఉన్న మట్టిగోడకు ఆనించి, చీర చెంగును తలమీద

కప్పుకుంది. ప్రార్థన చేయటానికన్నట్టు.

భార్య ప్రయత్నాన్ని గమనించిన యాకూబు కూడా ఆవిడ పక్కకు వచ్చి నిల్చున్నాడు.

ఇద్దరూ ఒకేసారి ఆ శిలువ బొమ్మ ముందు మోకరిల్లారు.

ఆ దృశ్యాన్ని చూసిన ఎస్తేరు రాణి కళ్లలో నీళ్లు తిరిగాయి.

క్రీస్తు దయవల్లనే మనుషులంతా సుఖంగా, సంతోషంగా వుండగలరని చర్చిలో ఫాదర్ చెప్పిన మాటలు ఆమెకి గుర్తుకొచ్చాయి.

తను కూడా తల్లిదండ్రులతోపాటు ఆ బొమ్మ ముందు మోకరిల్లిందామె!

❖

*విపుల మాసపత్రిక, ఏప్రిల్ 2012*